క్లుప్తంగా

లలితా పరమేశ్వరి అలంకరణలో బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ ఆలయ తిరునాళ్ల శుక్రవారం మూడవ రోజు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభ్యంగన స్నానం చేయించి, అభిషేకాలు జరిపించారు. అనంతరం అమ్మవారిని లలితా పరమేశ్వరి రూపంలో అలంకరించారు. పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి అమ్మవారిని తమ గ్రామానికి విచ్చేయమని భవనంవారిపాలెం, చోడిపాలెం గ్రామస్తులు స్వాగతం పలికారు. ఆలయ వంశ పారంపర్య అర్చకులు అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భవనంవారిపాలెం, చోడిపాలెం గ్రామానికి కనక తప్పెట్లు, బ్యాండు మేళాలతో వెళ్లారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

మోడల్ టెస్ట్‌లు విద్యార్థులకు ఉపయుక్తం



భట్టిప్రోలు: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్, పాలిటెక్నిక్ చదవులకు సిద్ధమవుతున్న విద్యార్థులకు శుక్రవారం గాయత్రి అకాడమీలో మోడల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి. మనోజ్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మే 10న పాలిసెట్, మే 15 నుంచి ఈఏపీ సెట్ పరీక్షలు నిర్వహిస్తున్నందున విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ కొండముది షణ్ముఖ శ్రీనివాసరావు (బాబీ) పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధుని జయంతి



బాపట్ల అర్బన్: పుట్టుకతో ఎవరూ గొప్పవారు కాదని, ఎలుగెత్తి చాటిన తొలి వ్యక్తి గౌతమ బుద్ధుడు అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు పేర్కొన్నారు. బుద్ధుడి జయంతి సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ వర్ణ వ్యవస్థను గౌతమ బుద్ధుడు వ్యతిరేకించి, సమతా సమాజాన్ని ప్రతిపాదించారని చెప్పారు. అసంబద్ధ ప్రమాణాలతో కూడిన సిద్ధాంతాలను తృణీకరించారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, తహసీల్దారు సీహెచ్ సుధారాణి, కవిత సోషల్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

12న పాత వాహనాల వేలం

బాపట్ల: బాపట్ల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఉన్న పాత వాహనాలను వేలం వేయనున్నట్లు ప్రధాన కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 12న ఉదయం 10.30 గంటలకు వేలం పాట ఉంటుందని, వివరాలకు 91211 02226 నంబరుకు సంప్రదించాలని తెలిపారు. వాహనాలు డీఎస్పీ కార్యాలయంలో ఉన్నాయని, గమనించాలని పేర్కొన్నారు.

నేడు యూటీఎఫ్ శిక్షణ తరగతులు

వేమూరు: బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో శనివారం యూటీఎఫ్ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కార్యదర్శి శాంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల జిల్లాకు సంబంధించిన యూటీఎఫ్ సభ్యులు ఉదయం 9గంటలకు హాజరు కావాలని ఆయన తెలిపారు. శిక్షణ తరగతుల్లో ఎంవీబీ సుబ్రహ్మణ్యం.. ఉద్యమ చరిత్ర, శ్రీనివాసరరావు.. పద్ధతులు, జి.శాంతరావు విద్యా రంగం పరిణామాలు, ఎం.వెంకటేశ్వరరెడ్డి వర్తమాన రాజకీయ, ఆర్థిక పరిణామాలుపై శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ తరగతులకు యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులందరూ హాజరు కావాలని పేర్కొన్నారు.

భక్తులకు అన్నదానం



బాపట్ల: శ్రీ క్షీర భావన్నారాయణస్వామి రథోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ శనివారం అన్నదానం చేపట్టారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరరావు, కొటికం సుబ్బారావు గురుస్వామి, ఇనగలూరి మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

వీడని అకాల భయం

- పలు చోట్ల పడిన వర్షం
- రైతులకు తప్పని ఇక్కట్లు
- రేపల్లెలో రోడ్లు జలమయం

రేపల్లె/భట్టిప్రోలు/కొల్లూరు : అకాల వర్షాల భయం రైతుల్లో వీడటం లేదు. శుక్రవారం జోరుగా వర్షం కురిసింది. రేపల్లె పల్లపు ప్రాంతాల రహదారులు జలమయం అయ్యాయి. దీంతో వాహన చోదకులు, పాదచారులు వర్షపు నీటిలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులుగా భానుడి ప్రతాపంతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు వర్షంతో కొంత ఉపశమనం పొందారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కజొన్న కల్లాల్లోనే తడిచిపోయింది. పట్టణంలోని పద్మావతి టాకీస్ సెంటరు, ప్రకాశం రోడ్డు, నిజాంపట్నం రోడ్డు, గరువు రోడ్డుతో పాటు పలు పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

కల్లాల్లో పంటకు పట్టలు..

అకాల వర్షాలతో రైతులు కంటతడి పెడుతున్నారు. భట్టిప్రోలులో శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం వర్షం కురిసింది. దీంతో రైతులు కల్లాల్లోని పంటను భద్రపరచుకునే పనిలో నిమగ్నమయ్యారు.

కర్షకులను వెంటాడుతున్న అకాల వర్షం

రోజుల తరబడి ఆకాశం మేఘావృతమై ఉండటంతోపాటు, చెదురుమదురుగా వర్షాలు కురుస్తుండటంతో కొల్లూరు మండలంలోని జొన్న, మొక్కజొన్న, పసుపు పంటలకు నష్టం వాటిల్లింది. రేకులతో ఇరిచిన మొక్కజొన్న కండెలు వర్షపు నీటి కారణంగా మొలకలు వేయడంతో పాటు, జొన్న కంకులు రంగు మారడం, కల్లాల్లో ఆరబెట్టిన.. ఉడకపెట్టిన పసుపు కొమ్ములు కుళ్లి పోతున్నాయి. జల్లులతో కూడిన వర్షం పడటంతో తడిచిన పంటలను ఆరపెట్టుకునే వెసులుబాటు లేక రైతులు అవస్థలు పడ్డారు. ఇటుక తయారీ చివరి దశలో ఉన్న తరుణంలో వర్షాల వల్ల అర్ధంతరంగా నిలుపుదల చేయాల్సిన పరిస్థితి వస్తుందన్న ఆందోళన ఉత్పత్తిదారుల్లో వ్యక్తమవుతోంది.



రేపల్లెలో పద్మావతి టాకీసు సెంటరు జలమయం



జోరువానలో ఇలా..



మొక్కజొన్న కండెలపై పరదా పట్టలు



పెద పులివర్రులో మొక్కజొన్నపై కప్పిన పరదా

అంగరంగ వైభవంగా దివ్య జంట రథోత్సవాలు

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలో కొలువైన మార్కండేయ ఈశ్వర భద్రావతి సమేత భావనా రుషి స్వామి, భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం దివ్య జంట రథోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. కల్యాణ మూర్తులైన స్వామి వార్లను పురవీధుల్లో ఊరేగించారు. హోమం, బలిహరణ అనంతరం రథోత్సవాలు ముందుకు సాగాయి. భక్తులు అడుగడుగునా స్వామి వార్లకు బ్రహ్మరథం పట్టారు. స్వామి వార్ల దివ్య జంట రథోత్సవాలను వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కల్యాణ మహోత్సవాలు పురస్కరించుకుని ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. దీపాల సత్యన్నారాయణ సారథ్యంలో గౌరీశంకర భక్త సమాజం భజన సంకీర్తనలు జరిగాయి. ప్రసాదాలను మాచర్ల దేవ సురేష్ బాబు -శ్రీదేవి దంపతులు అందించారు. జంట దివ్య రథాలు ఒక్కసారిగా ఎదురెదురుగా రావడంతో భక్తులు దిక్కులు పిక్కటిల్లేలా జై మార్కండేయ.. జై భావనారుషి అంటూ నినాదాలు చేశారు. బాణ సంచా, తారా జువ్వలు వెలిగించారు. రథోత్సవంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాన్స్‌కో ఏడీఏ ఎస్. భాస్కరరావు పర్యవేక్షణలో ఏఈ ఏడుకొండలు, విద్యుత్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. వేమూరు సీఐ కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో భట్టిప్రోలు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ బందోబస్తు నిర్వహించారు. శనివారం అన్న సంతర్పణ చేయనున్నారు. పెద శ్రేష్ఠులు దీపాల అవినాష్, డాక్టర్ కొతరపు వెంకటేష్, కొతరపు శ్రీనివాసరావు, పెత్తందార్లు కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



పుర వీధుల్లో దివ్య జంట రథోత్సవాలు

భట్టిప్రోలు నుంచి భాగ్యనగరికి వెళ్లి..



వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరుకు చెందిన సజ్జా సరస్వతి అనే వృద్ధురాలు అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతోంది. వలంటీర్ కొంగల మోరేష్ శుక్రవారం అక్కడకు వెళ్లి పింఛను అందజేశారు. మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ.. హైదరాబాదులోని కుమారుడి వద్ద ఉంటూ ఆమె చికిత్స పొందుతోంది. మోరేష్ మూడు నెలల నుంచి పింఛను నగదు అక్కడి కెళ్లి ఇస్తున్నారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్న ఘటన ఉయ్యూరువారిపాలెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. సెబ్ సీఐ లీనా వివరాల మేరకు.. తమకు అందిన సమాచారంతో ఉయ్యూరువారి పాలెం గ్రామంలో దాడులు నిర్వహించగా.. గ్రామానికి చెందిన వి.లక్ష్మీదేవి అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడిందని సీఐ తెలిపారు. ఆమె నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు సిద్ధం

వేమూరు: వేమూరు నియోజకవర్గంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.1962లకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులందరూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో పంటను అమ్ముకోవాలని పేర్కొన్నారు. వర్షాలు వల్ల దెబ్బ తిన్న మొక్కజొన్న పంటకు నష్ట పరిహారం కూడా అందిస్తోందని పేర్కొన్నారు.

సొసైటీ అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని వినతి

బాపట్ల: దగ్గుమల్లివారి పాలెం ఆది ఆంధ్ర కో–ఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీ అధ్యక్షుడు గుండాల విజయ్ డేవిడ్‌రాజ్‌పై చర్యలు తీసుకోవాలని సొసైటీ సభ్యులు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాకు, ఎమ్మెల్యే కోన రఘుపతికి ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం సొసైటీ సభ్యులు వినతి పత్రం అందించి, అనంతరం మాట్లాడారు. 20 ఏళ్ల నుంచి కూలీగా నటించి, సొసైటీ ఖాతా నుంచి జాతీయ రహదారి అధికారులు నష్ట పరిహారంగా ఇచ్చిన నగదు రూ.1.35కోట్లను దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విజయ్ డేవిడ్‌రాజ్‌పై విచారణ చేపట్టాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సొసైటీ సభ్యులు అడే రవికుమార్, దగ్గుమల్లి ధర్మారావు తదితరులు ఉన్నారు.



సొసైటీ అధ్యక్షుడు డేవిడ్‌రాజ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న సభ్యులు

కనుల పండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

చెరుకుపల్లి: గుళ్లపల్లి గ్రామంలోని గంగాంబిక సమేత ఆనందీశ్వర స్వామి ఆలయ ధ్వజ స్తంభం, శిఖర ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం స్వామికి శాంతి కల్యాణం, మహా కుంభాభిషేకం నిర్వహించారు. గ్రామానికి చెందిన వెంకటరమణ టింబర్ డిపో అధినేత పడితపు వెంకట రమణ, మహాలక్ష్మి దంపతులు సహకారంతో ధ్వజస్తంభాన్ని, గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ, ఉదయలక్ష్మి దంపతుల సహకారంతో ఆలయ కలశాలను ప్రతిష్ఠించారు. స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ, వేద పండితుల మంత్రోచ్ఛరణతో ఉదయం 10.59 గంటలకు భారీ క్రేన్ సాయంతో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠాపనగావించారు. ప్రతిష్ఠ సమయంలో ఆలయ ప్రాంగణమంతా భక్తుల శివ నామ స్మరణతో మారుమోగింది. ప్రతిష్ఠ అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రయాగ రాంబాబు శర్మ, శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యన్నారాయణ, ఆలయ చైర్మన్ ఓగిరాల వీరాస్వామి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు వీర్లంకమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కర్లపాలెం: పెద పులుగువారిపాలెంలో చిన అక్కలవారి కులదేవత వీర్లంకమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఉదయం 10.40గంటలకు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా శుక్రవారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, పంచ గవ్యం, దీక్ష, అఖండ స్థాపన మంగళ స్నానం పూజలు నిర్వహించి, వీర్లంకమ్మ, పోతురాజు విగ్రహాలకు మంగళ వాయిద్యాలతో నగరోత్సవం నిర్వహిచారు. భక్తులు దర్శనం అనంతరం అన్న సంతర్పణ చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ

ఘనంగా కట్లమ్మ తల్లి మహోత్సవాలు

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలో కొలువైన కట్లమ్మ తల్లి ఆలయ 25వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని నిత్య పూజ అనంతరం పావన నదీ స్నానం కావించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కృష్ణా నదీ జలాలతో వేద బ్రాహ్మణులు క్రోవి రామకృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు అమ్మవారికి దివ్య నీరాజనాలు పలికి, పండ్లు, టెంకాయలు, పూలు సమర్పించి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్రమాన్ని కట్లమ్మ దేవస్థాన అభివృద్ధి కమిటీ పర్యవేక్షించింది.

వైభవంగా సిడిమాను ఉత్సవం



మొగదారమ్మ తల్లి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ మోపిదేవి దంపతులు



సిడిమాను ఊరేగింపు

ప్రత్యేక పూజలు చేసిన ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: వేలాది మంది భక్తుల నడుమ విద్యుత్ దీపాల అలంకరణతో సిడిమాను ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. నిజాంపట్నంలోని శ్రీ మొగదారమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా గ్రామ వీధుల్లో శుక్రవారం ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు అడుగడుగునా సిడిమానుకు పూజలు నిర్వహించి, తమ భక్తిని చాటుకున్నారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు దంపతులు సిడిమానుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొగదారమ్మ తల్లి ఆలయంలో పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించి, నైవేద్యాలను సమర్పించారు. ఉత్సవాల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాగణం భక్తులతో పోటెత్తింది. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జబర్దస్త్ బృందం సభ్యులు ఫైమా, గడ్డం నవీన్, శాంతి కుమార్‌తో పాటు పలువురు సింగర్స్ పాల్గొని, ప్రదర్శనలిచ్చారు. ప్రజలు భారీగా తరలివచ్చి సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీ

బాపట్లఅర్బన్: బాపట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయం రికార్డులను పరిశీలించారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. జిల్లా పరిషత్ స్థలాలను పరిరక్షించాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పిన్నిబోయిన ఎస్తేరు రాణి, వైస్ ఎంపీపీ కుర్రా రమాదేవి చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాను ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ రాధాకృష్ణ, ఈఓపీఆర్డీ శరత్‌బాబు, ఏఈ మోహన్‌రావు, ఎంఈఓ నిరంజన్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ హెనీ క్రిస్టినా

మాజీ కౌన్సిలర్ కోటేశ్వరమ్మ విగ్రహం ఆవిష్కరణ

బాపట్ల: బాపట్ల పట్టణంలో నాలుగుసార్లు కౌన్సిలర్‌గా ఎన్నికైన మొట్ట మొదటి మహిళగా చేజర్ల కోటేశ్వరమ్మ సేవలు మరువలేనివని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద చేజర్ల కోటేశ్వరమ్మ విగ్రహాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అంకిత భావం, కృషి, పట్టుదలతో నాలుగు సార్లు కౌన్సిలర్‌గా విజయం సాధించడం ఆమెకే సొంతమన్నారు. కోటేశ్వరమ్మ రాజకీయ ప్రస్థానం 1996 నుంచి ఓటమి లేకుండా కొనసాగిందన్నారు. కోటేశ్వరమ్మ కుమారుడు సతీష్ ప్రజా సేవలోనే ఉంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ రజక సంఘ నాయకులు పాతపాటి అంజిబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాష్, వైఎస్సార్ సీపీ నాయకులు కళ్లి హరినాథ్‌రెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి, నక్క వీరారెడ్డి, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ ముప్పలనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కోటేశ్వరమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కోన రఘుపతి

చేనేత, హస్త కళా ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభం

బాపట్ల: బాపట్ల పట్టణంలోని టీటీడీ కల్యాణ మండలంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ ప్రదర్శనలు ఆకట్టుకునేవిధంగా ఉన్నాయని జెడ్పీటీసీ పిన్నిబోయిన ఎస్తేరురాణి పేర్కొన్నారు. హ్యాండ్లూమ్, హ్యాండి క్రాఫ్ట్స్ ప్రదర్శనను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్తేరు రాణి మాట్లాడుతూ చేనేత హస్తకళలకు చేయూతనిచ్చి.. సాంప్రదాయాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. పోచంపల్లి, నారాయణపేట్, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్‌తో పాటు ఎన్నో హస్తకళలను ప్రదర్శనతోపాటు అమ్మకానికి ఉంచారు. ఈ నెల 5 నుంచి 21వ తేదీ వరకు విక్రయాలు ఉంటాయని, వీటిని ఉపయోగించుకుని కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు.



చీరలు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ ఎస్తేరురాణి

వైభవంగా 'కొలంకపురి' నాటిక పోటీలు ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్



'మనిషి మంచోడే' నాటికలో సన్నివేశం



కొలకలూరు(తెనాలి): తెనాలి రూరల్ మండలం కొలకలూరులో కొలంకపురి నాటక కళా పరిషత్ తెలుగు రాష్ట్రాల స్థాయి నవమ ఆహ్వాన నాటికల పోటీలు శుక్రవారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ జ్యోతి ప్రజ్వలనతో ఆరంభమయ్యాయి. గ్రామంలోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయం ఎదుట ప్రత్యేక వేదికపై ప్రారంభ సభకు పరిషత్ అధ్యక్షుడు, ప్రముఖ సినీ నటుడు గోపరాజు రమణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ కవులు, కళాకారులు, రచయితలకు నిలయమైన కొలకలూరు వారసత్వాన్ని నేటి తరానికి తెలియజేసేలా నాటిక పోటీలను నిర్వహిస్తున్న పరిషత్ నిర్వాహకులను అభినందించారు. తెనాలి ప్రాంతానికి రాజకీయ నేతలతో కాకుండా కళా, సాహితీ, సాంస్కృతిక రంగాల ప్రముఖులతోనే ఖ్యాతి లభించిందని గుర్తుచేశారు. అనువైన స్థలం పరిశీలించి కళావేదిక నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.10 లక్షలను కేటాయిస్తానని సభా ముఖంగా ప్రకటించారు. గోపరాజు విజయ్ స్వాగతం పలికిన సభలో ఉపాధ్యక్షుడు సుద్దపల్లి మురళీధర్, గొడవర్తి శ్రీనివాసమూర్తి ప్రసంగించారు. తొలి ప్రదర్శనగా కళాంజలి, హైదరాబాద్‌వారి 'మనిషి మంచోడే' నాటికను ప్రదర్శించారు. స్వర్గీయ కాటా సుబ్బారావు రచనకు జెట్టి హరిబాబు దర్శకత్వం వహించారు. ప్రధాన పాత్రల్లో డి.మహేంద్ర, ఎస్.మాధవి, కె.రాధాకృష్ణ, జీఎస్ చలపతి, జె.హరిబాబు నటించారు. అనంతరం హేలాపురి కల్చరల్ అసోసియేషన్, ఏలూరు వారి 'మనసున మనసై' నాటికను ప్రదర్శించారు. 'మన పిల్లలతో అమ్మానాన్నలను ఆడుకోనిద్దాం ...వాళ్లు ఆనందపడతారు. మన అవసరాల కోసం అమ్మానాన్నలను వాడుకోవద్దు' అంటూ బిడ్డలకు హితోక్తి పలికిందీ నాటిక. ప్రధాన పాత్రల్లో పి.విజయకుమార్, వైకే భవాని, వై.ప్రణీత్, శీరం శ్రీనివాసరావు నటించారు. చింతల మల్లేశ్వరరావు, పి.కృష్ణ హితేష్ రచనకు మహ్మద్ ఖాజావలి దర్శకత్వం వహించారు.

కట్నం వేధింపులపై కేసులు నమోదు

తెనాలిరూరల్: కట్నం వేధింపులపై రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన గొండిపాటి అజితకు 2012లో ప్రభు కిషోర్‌తో వివాహమైంది. ఇటీవల భర్త మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. అలానే చినరావూరు తోట ప్రాంతానికి చెందిన అత్తలూరి లక్ష్మీతిరుపతమ్మ తనను భర్త లక్ష్మణ్ వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. రెండు కేసులను వన్‌టౌన్ పోలీసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి ఉన్న ఇద్దరి అరెస్ట్

తెనాలిరూరల్: గంజాయి కలిగి ఉన్న ఇద్దరిని త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. తెనాలి పట్టణ యడ్ల లింగయ్య కాలనీ సమీపంలో కొబ్బరి తోటల వద్ద ఇద్దరు యువకులు గురువారం రాత్రి అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, విచారించారు. ఆ యువకులను పట్టణానికి చెందిన గుర్రం విజయ్, గరిక సురేష్‌గా గుర్తించారు. ఇద్దరి వద్ద అరకిలో గంజాయి లభించడంతో అరెస్ట్ చేసి కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు.